

సమస్య పరిష్కారానికి అన్వేషణ

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు సమస్యల పరిష్కారాన్ని అన్వేషించేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ బిల్డథాన్‌ను ప్రారంభించింది. - 8లో▸



పెండింగ్ బకాయిలు చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35.1°/22.5°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

మున్నేరుకు మోక్షమెప్పుడో?

కలగానే సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం

- 30వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం
- కృష్ణానదిలోకి వృథాగా పాకాల ఏరు నీళ్లు
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రూ.131.67 కోట్ల నిధులు మంజూరు
- ప్రస్తుతం రైతుల కల సాకారమయ్యేనా..



ముల్కనూరు సమీపంలోని పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్టు నిర్మించే ప్రతిపాదిత స్థలం (ఫైల్)

గార్ల: పాలకుల నిర్లక్ష్యం వల్ల దశాబ్దాలుగా మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. ఇంతకాలం సీమాంధ్ర సీఎంలు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు మరుగున పడింది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తమ కష్టాలు తీరుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.

వెంగళరావు హయాంలో సర్వే..

పాకాల ఏటి వరద నీళ్లు వర్షాకాలంలో మూడు నెలల పాటు వృథాగా వెళ్లి కృష్ణానదిలో కలుస్తుంటాయి. 40 ఏళ్ల క్రితం గార్ల ప్రాంతంలో మున్నేరు ప్రాజెక్టు నిర్మించడం వల్ల 30 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు స్థానిక ప్రజలు తెలిపారు. ఆయన స్పందించి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇంజనీరింగ్ అధికారులను సర్వేకు పంపించినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే నాలుగు దశాబ్దాలుగా ఎందరో ముఖ్యమంత్రులు మారిన ప్పటికీ ఈ ప్రాజెక్టు నిర్మాణం సర్వేలకే పరిమితమైంది.

వైఎస్సార్ హయాంలో నిధులు..

గార్ల మండలం ముల్కనూరు గ్రామ సమీపంలోని పాకాల ఏటిపై ప్రతిపాదించిన మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలో అడుగులు పడ్డాయి. వైఎస్సార్ ఆదేశాల మేరకు నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథన్ 2009 మార్చి 2న రూ.131.67 కోట్ల నిధులు మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలన ఆమోదం తెలుపుతూ జీఓ విడుదల చేశారు. కాగా, 2003లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపక్ష హోదాలోరాష్ట్రంలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా గార్ల మండలానికి వచ్చినప్పుడు ఈప్రాంత రైతులు ఆయనను కలిసి మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం గురించి వివరించారు. కాగా తాము అధికారంలోకి వస్తే ప్రాజెక్టు కచ్చితంగా నిర్మిస్తానని రైతులకు హామీఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం 2009 ఎన్నికల ముందు మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆయన నిధులు విడుదల చేశారు. కానీ దురదృష్టవశాత్తు హెలికాప్టర్ దుర్ఘటనలో వైఎస్సార్ మరణించడంతో మళ్లీ ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఆయన బతికుంటే ఈ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని ఈ ప్రాంత రైతులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టుతో లబ్ధి పొందే మండలాలు..

ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే గార్ల, కామేపల్లి, డోర్నకల్, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన సుమారు 30వేల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరు సైతం అందుతుంది.



ప్రాజెక్టు నిర్మించాలని 2006లో నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను కలిసిన అప్పటి ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య(ఫైల్)

మున్నేరు జలసాధన కమిటీ..

మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం కోసం వివిధ పార్టీల నాయకులతో మున్నేరు జలసాధన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా నాటి ఇల్లెందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను ఎన్నుకున్నారు. పలుమార్లు నాటి ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు జలసాధన కమిటీ సభ్యులు గోపగాని శంకర్‌రావు, తదితరులు కలిసి మున్నేరు ప్రాజెక్ట్ కోసం నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులను, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మున్నేరు ప్రాజెక్టు కోసం నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలి



ఏటా వర్షాకాలంలో మూడు నెలలు పాకాల ఏటి నుంచి నీళ్లు వృథాగా వెళ్లి కృష్ణానదిలో కలుస్తున్నాయి. పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్టు నిర్మిస్తే గార్ల మండలంతో పాటు డోర్నకల్, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

- గద్దిపాటి రాజారావు, రైతు, సీతంపేట, గార్ల

రెండు పంటలు సాగవుతాయి



ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల ఖరీఫ్, రబీ రెండు పంటలు సాగవుతాయి. సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి నివారించవచ్చు. 40 ఏళ్ల నుంచి ఈ ప్రాజెక్టు కోసం పలుమార్లు ముఖ్యమంత్రులు నిర్వహించిన సర్వేలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

- వై.కృష్ణారెడ్డి, రైతు, రాంపురం, గార్ల

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



గార్ల: మండలంలోని మద్రిగూడెం దేవాలయంలో నేటి నుంచి ప్రారంభం కానున్న వేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్‌కు దేవాలయం ఈఓ సంజీవరెడ్డి ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. జిల్లా కేంద్రంలో కలిసి ఆహ్వానపత్రిక అందజేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ అర్చకుడు అచ్యుతాచార్యులు ఉన్నారు.

కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు.

ఏజెన్సీ మండలాల్లో రిజర్వేషన్లు కల్పించాలి



గార్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని ఏజెన్సీ మండలాల్లో బీసీ, ఎస్సీ కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ తెలిపారు. ఆదివారం వివిధ పార్టీల నాయకులతో కలిసి గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ జిల్లా, మండలాల్లో ఎంపీటీసీ, వార్డు స్థానాల్లో బీసీ, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ అధికారులు బీసీ, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్, అధికారులు స్పందించి స్థానిక ఎన్నికల్లో బీసీ, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ మండలాల్లో బీసీ, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధానమంత్రి, భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీలకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రాలు పంపినట్లు విశ్వ పేర్కొన్నారు. సమావేశంలో టీవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్రం నాగేశ్వరరావు, కందునూరి ఈశ్వర్‌లింగం, పోతుల నర్సింహారావు, రాధాకృష్ణ, బాబు, సూత్రపు రాజుయాదవ్, చిలక నర్సయ్య, మీగడ శ్రీనివాస్, ముంగి రాములు, తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఏటి నుంచి వేంకటేశ్వరస్వామికి బిందెతీర్థం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గార్ల: మండలంలోని మద్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఆదివారం పాకాల ఏటి నుంచి వేదపండితులు బిందె తీర్థంను మేళతాళాలతో దేవాలయానికి తీసుకొచ్చారు. ఈ బిందెతీర్థంతో గార్లలోని వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు అచ్యుతాచార్యులు మాట్లాడారు. నేడు గార్లలోని వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి మేళతాళాలతో ఊరేగింపుగా మద్రిగూడెం దేవాలయానికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సంజీవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అధిక మెజార్టీతో గెలిపించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గంగారం: మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను అధిక మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గంగారం మండలంలో ఐదు ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, వాటిని ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాలు గెలుపొందాలి

కొత్తగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచే విధంగా కార్యకర్తలు పని చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పోలారం, పొగుళ్లపల్లి గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో కొత్తగూడ మండలానికి కేటాయించిన నిధుల వివరాలను ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానాలు ఇవ్వాలని అన్నారు. పొగుళ్లపల్లిలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నాయకులు చల్ల నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, బానోతు రూప్‌సింగ్, బిట్ల శ్రీనివాస్, వివిధ గ్రామ కమిటీల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృత్ భారత్ పనుల్లో జాప్యం



నిలిచిన ఎఫ్ఓబీ, ర్యాంపు, ఎస్కలేటర్, లిఫ్ట్ పనులు

- అలంకారప్రాయంగా ఎఫ్ఓబీ, ర్యాంపు, ఎస్కలేటర్, లిఫ్ట్ పనులు

మహబూబాబాద్ రూరల్ : అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని ఒకటి, రెండో నంబర్ ప్లాట్‌ఫారాలపై జరుగుతున్న అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. రెండేళ్లక్రితం ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, దక్షిణ మధ్య రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయంతో అమృత్ భారత్ పనులు చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న 12 మీటర్ల ఎఫ్ఓబీ, ర్యాంపు, ఎస్కలేటర్, లిఫ్ట్ పనులు నత్తనడకన కొనసాగుతూ అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. ప్లాట్ ఫారాలపై పనులు పూర్తి చేయకపోవడంతో రైళ్ల కోచ్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రైళ్లు వచ్చి వెళ్లే సమయాల్లో ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఏడీఆర్ఎం ఇప్పటికే మూడు పర్యాయాలు వచ్చి పనులను సందర్శించిన సమయంలో ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి త్వరలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీసీలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

మహబూబాబాద్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో 42శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెడుతోందని మాజీ ఎంపీ సీతారాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడ్డవిధంగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 42శాతం బీసీ రిజర్వేషన్ పేరుతో నాటకాలు ఆడుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీసీలపై ప్రేమ ఉంటే 42శాతం బీసీలకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలపై కపట ప్రేమను చూపుతుందని, ఇది ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆరోపించారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతం మానుకోట జిల్లా అని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తూ పబ్బం గడుపుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచ్యువల్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్ గౌడ్, గద్దం అశోక్ కుమార్, గూగుల్ మదన్ నాయక్, సీనియర్ నాయకులు నాయిని ధర్మారెడ్డి, పాదిల నరసింహారెడ్డి, చిల్పూరి వెంకన్న, ఓర్సు పద్మ, గుగులోత్ దేవిక, శంకర్ నాయక్, నరేష్ నాయక్, పల్లె సందీప్, కలిసాని ప్రభాకర్ రెడ్డి, తాడ పూర్ణచందర్ రెడ్డి, దార హిందూ భారతి, అశోక్ తదితరులు ల్గొన్నారు.

స్లాట్ బుకింగ్.. స్పాట్ సెల్లింగ్

పత్తి విక్రయానికి ఇక ఇబ్బందులుండవ్





- ప్రత్యేక యాప్‌ను రూపొందించిన సీసీఐ
- 'కాపాస్ కిసాన్' యాప్ ద్వారా బుకింగ్
- యాప్‌పై వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులకు శిక్షణ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5,23,848 ఎకరాల్లో పత్తి సాగు

హన్మకొండ: పంట అమ్ముకునే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి పత్తి రైతులకు ఇక విముక్తి లభించనుంది. కనీస మద్దతు ధర అందించడంతోపాటు దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా పత్తి అమ్ముకునేందుకు, క్రయవిక్రయాలు పారదర్శకంగా జరిగేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) 'కా పాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఇక నుంచి రైతులు ఈ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని పంటను అమ్ముకోవాలి. ఈ నేపథ్యంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ యాప్‌పై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు రైతుల మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పత్తి బుక్ చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తారు. తద్వారా పత్తి క్రయవిక్రయాలు పూర్తిగా యాప్ ద్వారానే సాగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి దాదాపు 5,23,848 ఎకరాల్లో సాగు చేశారు.

స్లాట్ బుక్ చేసుకుంటేనే అమ్మకం..

రైతులు 'కా పాస్ కిసాన్' యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుంటేనే పత్తి అమ్ముకోగలుగుతారు. రైతులు ఏ మిల్లులో అమ్ముకుంటారో తెలుపుతూ స్లాట్ బుక్ చేయగానే తేదీ, సమయాన్ని అధికారులు యాప్ ద్వారా సమాచారం అందిస్తారు. అదే నిర్ణీత రోజు, నిర్ణీత సమయానికి రైతు పత్తిని తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు. స్లాట్ బుక్ చేసుకోకపోతే పత్తిని అమ్ముకోలేరు. రైతులు మూడుసార్లు స్లాట్ బుక్ చేసుకుని, స్లాట్‌ను రద్దు చేసుకోకుండా పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి విక్రయించకపోతే ఆ రైతు పేరు బ్లాక్‌లిస్టులోకి వెళ్తుంది. బ్లాక్ లిస్టులో నుంచి పేరు తొలగించి, తిరిగి పత్తి అమ్ముకోలాంటే సీసీఐ అధికారులతో ప్రత్యేక అనుమతి తీసుకోవాలి.

పత్తి క్వింటాకు రూ.8,110 మద్దతు ధర..

కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాకు రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది. 'కా పాస్ కిసాన్' యాప్ ద్వారా మద్దతు ధర పొందే అవకాశాన్ని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కల్పించింది. స్మార్ట్ ఫోన్‌లేని రైతులు ఇతరుల స్మార్ట్ ఫోన్ నుంచి కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. రైతు పాస్‌బుక్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 'కా పాస్ కిసాన్' యాప్‌లో రైతు పట్టాదారు పాస్‌బుక్ నంబర్, ఇతర వివరాలు నమోదు చేయగానే పంట ఎంత సాగు చేశారో వివరాలు అందులో వస్తాయి. వ్యవసాయ శాఖ ఇప్పటికే డిజిటల్ క్రాప్ సర్వే చేస్తూ పంట సాగు వివరాలు నమోదు చేస్తోంది. డిజిటల్ క్రాప్ సర్వే దాదాపు పూర్తి కావొచ్చింది. పంట సాగు విస్తీర్ణాన్ని బట్టి దిగుబడి లెక్కిస్తారు. ఈ యాప్ ద్వారా రైతులకు దళారుల నుంచి విముక్తి కలుగుతుంది. రైతులు నిరీక్షించాల్సిన బాధ తప్పుతుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తిసాగు వివరాలు

జిల్లా	విస్తీర్ణం (ఎకరాలు)
వరంగల్	1,18,547
హనుమకొండ	74,849
మహబూబాబాద్	85,480
ములుగు	20,593
భూపాలపల్లి	98,260
జనగామ	1,26,119

ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

'కా పాస్ కిసాన్' యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక ముందుగా రైతు పేరు, జండర్, పుట్టిన తేదీ, కులం, చిరునామా, ఆధార్, ఫోన్ నంబర్, కౌలురైతు/సొంతమా అనే వివరాలు నమోదు చేయాలి. పట్టాదారు పాస్ పుస్తకం నంబర్, సర్వే నంబర్, రైతుకు ఉన్న మొత్తం భూమి, ఇందులో పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం వివరాలు యాప్‌లో నిక్షిప్తం చేయాలి. రైతుకు సంబంధించిన ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మహబూబాబాద్ రూరల్: సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సెలవులు ముగియడంతో జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, తండాల ప్రజలు ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణం ప్రయాణికులతో కిటకిటలాడింది. వరంగల్, సికింద్రాబాద్, హైదరాబాద్ వైపునకు ప్రతీరైలు ప్రయాణికులతో కిక్కిరిసి వెళ్లింది. కాగా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు జనరల్ బోగీల సంఖ్యను పెంచకపోవడంతో చాలామంది ప్రయాణికులు రైళ్లు ఎక్కకుండానే నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. రైళ్లు స్టేషన్‌లో రెండు నిమిషాలు మాత్రమే ఆగి కదిలి వెళ్లడంతో వందలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

వెంకటాపురం(కె): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని పాత్రాపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రానిబోయిన నరేశ్(32) తన ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ డోర్ తీస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన గ్రామస్తులు 108లో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతి చెందాడు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇనుప పైపు మీద పడి వ్యక్తి ..


రాజయ్య (ఫైల్)

ములుగు రూరల్: ఇనుప పైపు మోస్తున్న క్రమంలో కాలుజారి కిందపడడంతో పైపు మీద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ములుగు జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. తోటి కూలీ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న కలెక్టరేట్ పనుల్లో భాగంగా వెంకటాపూర్(ఎం) గ్రామానికి చెందిన సిరిపెల్లి రాజయ్య(48), గడ్డమీది మహేందర్ కలిసి ఫస్ట్ ఫ్లోర్‌లో ఇనుప పైపు ఎత్తుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజయ్య కాలుజారి కిందపడగా పైపు మీద పడి తీవ్ర గాయమైంది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. మృతుడికి భార్య సుమలత, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.

రేబిస్ లక్షణాలతో బాలుడు..

- వావిలాలలో ఘటన


శ్రీచరణ్(ఫైల్)

పాలకుర్తి టౌన్: రేబిస్ లక్షణాలతో ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాలలో చోటు చేసుకుంది. మృతుడి తల్లిదండ్రుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మైదం శ్రీనివాస్, శ్యామల దంపతుల రెండో కుమారుడు శ్రీచరణ్(10)ను రెండు నెలల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద కుక్క కరిచింది. రెండు, మూడు రోజులుగా జ్వరంతోపాటు నీరును చూస్తే భయపడడం, నాలుకను బయటకు తీస్తుండడంతోపాటు నోటి నుంచి నురగ వచ్చింది. దీంతో కుటుంబీకులు ఆందోళన చెంది వెంటనే బాలుడిని హైదరాబాద్ తార్నాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని స్వగ్రామం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పిల్లలు కుక్కలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ పిల్లలకు కూడా ఇలాంటి దారుణ పరిస్థితి రావొద్దని బోరున విలపించారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సాయిరెడ్డి (ఫైల్)

బచ్చన్నపేట : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొన్నె గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మెంతల సాయిరెడ్డి (33), నందిని దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల గొడవలు జరగడంతో నందిని కాపురానికి రావడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన సాయిరెడ్డి ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు.

సమస్య పరిష్కారానికి అన్వేషణ

- ఉద్యమంగా వికసిత్ భారత్ బిల్డథాన్–2025
- ఆరో తేదీవరకు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి
- 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు అవకాశం



విద్యారణ్యపురి: దేశ వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు సమస్యల పరిష్కారాన్ని అన్వేషించేందుకు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ వికసిత్ భారత్ బిల్డథాన్–2025ను దేశవ్యాప్తంగా ఉద్యమంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో (ప్రభుత్వ, ప్రైవేట్) 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న (మూడు నుంచి ఏడుగురు విద్యార్థుల సమూహాలు) విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా వికసిత్ భారత్ బిల్డథాన్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్//బీబీబీ.జీఓవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 6న ప్రత్యక్ష సమకాలీన ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ థీమ్స్‌పై వివరణ, చేసే పద్ధతిపై లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం ఉంటుంది.

వికసిత్ భారత్ బిల్డథాన్ ఇతివృత్తాలు..

ఆత్మనిర్భర్ భారత్: స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలను నిర్మించడం. స్వదేశీ ఆలోచనలు, జ్ఞానవ్యవస్థలు అలాగే ఆవిష్కరణలను పెంపొందించడం

స్థానికులకు స్వరం: స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం.

సమృద్ధ భారత్: సమృద్ధ భారత్ కోసం శ్రేయస్సు, స్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం.

ఉపాధ్యాయుల పాత్ర: విద్యార్థి బృందాలకు మార్గదర్శకత్వం వహించేలా ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుంది.

- ఆలోచన, సమస్య పరిష్కారం, నమూనా అభివద్ధిపై మార్గదర్శకత్వం అందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాల్సి ఉంటుంది.
- పోర్టల్ రిజిస్ట్రేషన్ సమర్పణ (ఆలోచన/నమూనా) ప్రక్రియలో విద్యార్థులకు సాయం చేయడం.

థీంలను వివరించడం: విద్యార్థులు తమ ప్రాజెక్టులను నాలుగు ప్రధాన థీంలతో అర్థం చేసుకున్నారని, సమలేఖనం చేసుకున్నారని ఉపాధ్యాయులు నిర్ధారించుకోవడం.

- స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం.
- ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, సమృద్ధి భారత్‌పై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

జట్టు కృషిని ప్రోత్సహించాలి: టీచర్లు ప్రభావవంతమైన జట్టు డైనమిక్స్ కోసం సహకార వాతావరణాన్ని పెంపొందించుకోవాలి.

విద్యార్థుల పాత్ర: టీంలుగా 6–12 తరగతుల నుంచి 3–7 మంది విద్యార్థుల సభ్యుల బృందంలో చేరాల్సి ఉంటుంది.

ఆవిష్కరణ: సృజనాత్మక ఆలోచనలకు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది.

నమూనాలను రూపొందించుకోవాలి: విద్యార్థులు వారి ఆలోచన భౌతిక లేదా డిజిటల్ నమూనాను రూపొందించడానికి కలిసి పనిచేయాలి.

వీడియోను సృష్టించండి, సమర్పించండి: విద్యార్థుల ప్రాజెక్టు (ఆలోచన లేదా నమూనా) ప్రదర్శించే ఒక చిన్న వీడియోను (2 నిమిషాల కంటే తక్కువ) తయారు చేసి పోర్టల్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

- విద్యార్థులు వికసిత్ భారత్ బిల్డథాన్ లో పాల్గొనేలా ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి.
- 6–12 తరగతుల విద్యార్థుల్లో బిల్డథాన్‌ను చురుకుగా ప్రచారం చేయాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయాలి..

- గడువులోగా అన్ని జట్లు అధికారిక పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయని నిర్ధారించుకోవాలి.
- మౌలిక సదుపాయాలను అందించడం: జట్లు ప్రాజెక్టులను సిద్ధం చేసుకునేందుకు, నిర్మించడానికి అనుకూలమైన వాతావరణాన్ని (ప్రయోగశాల, తరగతి గది) అందించాలి.
- విద్యార్థులు తమ తుది ఎంట్రీలను (ఆలోచనలు/నమూనాలు) అప్‌లోడ్ చేయడంలో మార్గనిర్దేశం హెచ్‌ఎంలు, టీచర్లు చేయాల్సి ఉంటుంది.

విద్యార్థులకు ఉత్సాహం కల్పించాలి..

విద్యార్థుల ఉత్సాహాన్ని నిర్ధారించడానికి కార్యకలాపాల శ్రేణిని నిర్వహించాలి. బిల్డథాన్ థీమ్ (ఆత్మనిర్భర్ భారత్, స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్ సమృద్ధి) ప్రకారం పాఠశాలలో 4 క్లబ్‌లను ప్రవేశపెట్టడం, పోటీలను నిర్వహించడం (జింగిల్స్, క్విజ్), బిల్డథాన్ పోస్టర్లను ప్రదర్శించడం, ప్రింటెడ్ టీ–షర్టుల వంటి ఈవెంట్ బ్రాండెడ్ మర్చండైజ్‌ను ఉపయోగించాలి. విద్యార్థుల కోసం వర్క్‌షాప్ నిర్వహించడానికి పరిశ్రమ నిపుణులను ఆహ్వానించడం ద్వారా ఇది చేయొచ్చు. పాఠశాలలు, ప్రముఖ ప్రదేశాలల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించండి.

జింగిల్ లోగోను వ్యాప్తి చేయాలి



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జింగిల్ లోగోను పాఠశాలల్లో విస్తృతంగా వ్యాప్తి చేయాలి. పాఠశాలలో జింగిల్ ప్లే చేయాలి. కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, అఖిలభారత సాంకేతిక విద్య (ఏఐసీటీఈ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశంలోని జిల్లాస్థాయిలో వెయ్యి మందికి బహుమతులు, రాష్ట్రస్థాయిలో వంద మంది, జాతీయస్థాయిలో 10 మంది విజేతలకు మొత్తం రూ.కోటి విలువైన బహుమతులు అందించనున్నారు.

– ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి, హనుమకొండ

పేదల మనిషి గడ్డం వెంకటస్వామి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి, ఇళ్లు కట్టించిన పేదల మనిషి గడ్డం వెంకటస్వామి అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ముందుగా వెంకటస్వామి చిత్రపటానికి సీఎండీ వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యమకారుడిగా, ప్రజాసేవకుడిగా, రాజకీయ నాయకుడిగా వెంకటస్వామి విశిష్ట సేవలందించారని కొనియాడారు. వెంకటస్వామి 'కాకా'గా అందరికీ సుపరిచితులు అని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు టి.సదర్‌లాల్, వెంకటరమణ, సీజీఎం రవీంద్రనాథ్, జీఎం వెంకటకృష్ణ, డీఈ (టెక్నికల్) సంపత్‌రెడ్డి, ఏఎస్ రమణారెడ్డి, ఏఓ నీలారపు రాజేందర్, దేవేందర్, సుదర్శన్‌రావు, రమేశ్, రవిచంద్ర, గోవర్ధన్, హేమచందర్ పాల్గొన్నారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి.. ఆపై చైన్‌స్నాచింగ్

- వృద్ధురాలి మెడ నుంచి పుస్తెల తాడు లాక్కెళ్లిన దుండగుడు
- కొండపర్తిలో ఘటన


వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్

ఐనవోలు: కొండపర్తిలో చైన్‌స్నాచింగ్ జరిగింది. నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలికి బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిన దుండగుడు.. మార్గమధ్యలో ఆమె మెడ నుంచి బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లాడు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు వరంగంటి వనమ్మ ఆదివారం గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రానికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ సమయంలో అటు వైపుగా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ఆమెకు లిఫ్ట్ ఇచ్చాడు. మార్గమధ్యలో బైక్ ఆపి వృద్ధురాలి మెడ నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

అలుగు పొలుసులు తరలిస్తున్న ముఠా అరెస్ట్


అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు పొలుసులు

న్యూశాయంపేట: ములుగు జిల్లా ఏటూరునాగారం అటవీ ప్రాంతం నుంచి అలుగు పొలుసులు (పాంగోలిన్ స్కేల్స్) అక్రమంగా తరలించి ఆగ్నేసియా దేశాలకు ఎగుమతి చేస్తున్న నలుగురు సభ్యులు గల ముఠాను హైదరాబాద్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం హనుమకొండ ఉనికిచర్ల బైపాస్ వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి 6.53 కిలోల అలుగు పొలుసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఔషధ తయారీలో అలుగు పొలుసులను వినియోగిస్తారన్నారు. వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం అలుగులను వేటాడడం నేరమన్నారు. కాగా, నిందితులు తిమ్మంపేటకు చెందిన సునీల్, మల్లక్‌పల్లికి చెందిన యోహాన్, వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన ఎం.సందీప్, కోమటిపల్లికి చెందిన మనోజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎఫ్ఓ లావణ్య, ఎఫ్ఆర్ఓ శిరీష, డీఆర్ఓ మోహన్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వలకు చిక్కిన వింత చేప



వాజేడు: ములుగు జిల్లా వాజేడులోని గోదావరిలో వింత చేప చిక్కింది. వాజేడుకు చెందిన కొప్పనాతి వెంకటేశ్వర్లు ఆదివారం గోదావరికి చేపల వేటకు వెళ్లగా వలలో వింత చేప పడింది. అది ఏ రకం చేపనో, దాని పేరు ఏమిటో తనకు తెలియదని చెప్పాడు. 58 ఏళ్లుగా చేపలు పడుతున్నానని, ఇంత వరకు ఈ రకం చేపను చూడలేదని తెలిపాడు. చేపపైన జిగ్‌జాగ్‌గా నల్ల మచ్చలు గరుకుదనంతో ఉన్నాయని చెప్పాడు. అన్ని చేపలకు ఉన్నట్లు చేప పైన ఎలాంటి పొలుచులు లేవు. ఈ చేపను తింటే ఏమైనా అవుతుందేమోనని భావించి దానిని తిరిగి గోదావరిలో వదిలేశానని వెంకటేశ్వర్లు వివరించాడు.

పిడుగుపాటుతో పగిలిన ట్రాన్స్‌ఫార్మర్


పిడుగుతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలి కారుతున్న ఆయిల్

శాయంపేట: పిడుగుపాటుతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలిన ఘటన మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగిరేణిగూడెం గ్రామంలోని పోచమ్మ గుడి దగ్గర సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పిడుగు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పగిలి ఆయిల్ కారుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'భీమునిపాదం'లో పర్యాటకుల సందడి..

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాద జలపాతంలో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు జలపాతాన్ని వీక్షించడానికి కారు, ఆటో, ద్విచక్రవాహనాలపై భీమునిపాదం చేరుకున్నారు. ఈ సందర్భంగా జలపాతం నుంచి జాలువారుతున్న నీటి కింద స్నానం చేస్తూ సందడి చేశారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు.


జలపాతం వద్ద పర్యాటకులు ..

ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్


మల్లూరు వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

- మల్లూరులో రెండు గంటలపాటు నిలిచిన రాకపోకలు
- ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రయాణికులు


బస్సు దిగి చెట్ల కిందకు వెళ్తున్న ప్రయాణికులు


ట్రాఫిక్ క్లియర్ చేయిస్తున్న ఎస్సై సూరి

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రహదారిపై ఇసుక లారీలను నిలిపి వేయడంతో ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, కార్లు, ఆటోల్లోని ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉక్కపోత భరించలేక వాహనాలు దిగి రోడ్డు వెంట చెట్లకింద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై టీవీఆర్ సూరి సిబ్బందితో హుటాహుటిన చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఇసుక లోడింగ్ కోసం వచ్చే లారీలను పార్కింగ్ చేసేందుకు ప్రత్యేక స్థలాన్ని చూసుకోవాలని హెచ్చరించారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన సమితి డిమాండ్


మాట్లాడుతున్న ధర్మేంద్ర

కాశీబుగ్గ: కాశోజీ సెంటర్ : రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన సమితి తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అడ్‌హక్ కమిటీ సర్వసభ్య సమావేశం కన్వీనర్ శ్రీధర్ల ధర్మేంద్ర అధ్యక్షతన హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 , మార్చి నుంచి 2025, సెప్టెంబర్ వరకు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.చంద్రమౌళి, అధ్యక్షుడిగా శ్రీధర్ల ధర్మేంద్ర, అసోసియేట్ అధ్యక్షులుగా కందుకూరి దేవదాస్, ఎండి.మహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శిగా కడారి భోగేశ్వర్, జాయింట్ సెక్రెటరీలుగా ఎండి.అబ్దుల్ గఫార్, ఎం. దామోదర్, ఉపాధ్యక్షులుగా సంకాబంద్రి నారాయణ, ఎస్.గోవర్ధన్, పి.సంజీవ రెడ్డి, లక్ష్మయ్య, కార్యదర్శులుగా ఎస్.విష్ణువర్ధన్, పి.సోమయ్య.పి.రమణారెడ్డి, బి.అశోకుమార్, కోశాధికారిగా సూరం కుమారస్వామి, టి.రఘువీర్ ఎన్నికయ్యారు.

పార్కిన్‌సన్‌కు అత్యుత్తమ చికిత్స

- యశోద హాస్పిటల్ న్యూరాలజిస్టు డాక్టర్ రూపం బోర్గాని


మాట్లాడుతున్న డాక్టర్ రూపం బోర్గాని

హన్మకొండ: పార్కిన్‌సన్ (వణుకుడు) వ్యాధికి హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యుత్తమ చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి పార్కిన్‌సన్ వ్యాధి, చలనరుగ్మతల డైరెక్టర్, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ రూపం బోర్గాని తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని యశోద క్లినిక్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చికిత్స పొంది కోలుకున్న హుజూరాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, కాజీపేట ఫాతిమానగర్‌కు చెందిన సంగీతతో కలిసి ఆయన మాట్లాడారు. పార్కిన్‌సన్ ప్రపంచంలో అత్యంత సాధారణ న్యూరో జనరేటివ్ వ్యాధి అని, మన దేశంలో ప్రతి లక్ష జనాభాలో 42 నుంచి 60 శాతం ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు బీపీ, షుగర్‌లా జీవితాంతం ఉంటాయని వివరించారు. డీ బ్రెయిన్‌స్టిములేషన్(డీబీఎస్) చికిత్స ద్వారా వ్యాధి నయం చేయవచ్చని తెలిపారు. మందులు వాడినా ప్రతి సంవత్సరం పెరుగుతుందని, మొదటి మూడు, నాలుగు సంవత్సరాలు మందులు ఇవ్వనున్నట్లు వివరించారు. అయితే ఈ మందుల ప్రభావం రానురాను అంతగా కనిపించదని, ఈ సమయంలో డీబీఎస్ (డీబ్రెయిన్‌స్టిములేషన్) ద్వారా వ్యాధి లక్షణాలను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తులకు డీబీఎస్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ విధానం జీవన పరిణామాలు మెరుగుపరుచడంలో అద్భుత ఫలితాలు ఇస్తుందన్నారు. మెదడులోని నిర్దిష్ట భాగంలో ఎలక్ట్రాడా అమర్చి ఛాతిలోని చిన్న పరికరానికి కనెక్ట్ చేయడం ద్వారా చేసే ప్రక్రియ అన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో డాక్టర్ రూపం బోర్గాని ఆధ్వర్యంలోని సీనియర్ క్లినికల్ డైరెక్టర్ న్యూరాలజిస్ట్ రాజేశ్ అలుగోలు, వీపీఎస్ ఆర్‌కే ప్రసాద్ టీం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ వ్యాధికి సుమారు రూ.13 నుంచి రూ.14 లక్షల వరకు ఖర్చు అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో ఈ వ్యాధిని చేర్చినట్లు చెప్పారు. సమావేశంలో సాయి, వెంకట్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


కనకం రాజు

మడికొండ: భార్యతో గొడవపడి యువకుడు అదృశ్యమయ్యాడు. సీఐ కిషన్ కథనం ప్రకారం.. మడికొండ గ్రామానికి చెందిన కనకం రాజు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. రాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వివరించారు.